# శ్రమయేవ జయతే!

- ఉపాధ్యాయుల సంకల్పాన్ని వరించిన అవార్డులు
- రాష్ట్రస్థాయిలో మెరిసిన జంగపల్లి ఉన్నత పాఠశాల
- ఎస్సీఈఆర్టీ 'మార్గదర్శకులు' పుస్తకంలో చోటు
- టెడ్- ఎడ్ టాక్స్ లైసెన్స్ పొందిన తొలి ప్రభుత్వ బడి
- విద్యతో పాటు సాంస్కృతిక, కీడ్ర అంశాలపై దృష్టి
- పదో తరగతి ఫలితాల్లో మండలంలోనే టాప్
- 25 ఏండ్ల చరిత్రను తిరగరాసిన విద్యార్థులు
- సేంద్రియ వ్యవసాయంతో కూరగాయల సాగు
- చేయిచేయి కలిపి తీరొక్క మొక్కల పెంపకం
- నానా రకాల చెట్లతో ఆహ్లాదకర వాతావరణం
- చెట్లను చంటి పిల్లల్లా కాపాడుతున్న విద్యార్థులు
- ప్రధానోపాధ్యాయురాలి కృషి.. ఉపాధ్యాయుల
- పట్టుదలతో మారిన ప్రభుత్వ పాఠశాల రూపురేఖలు
- జిల్లాకే ఆదర్శంగా జంగపల్లి ఉన్నత పాఠశాల
- నేడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం



**శెనార్తి మీడియా, గన్నేరువరం,**

'అంకిభావంతో పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చు'అని ఇక్కడి ఉపాధ్యాయులు నిరూపించారు. సర్కారు బడిలో వినూత్న కార్యక్రమాలు చేపడుతూ 'మార్పు సాధ్యం కాదు'అని అనుకునేవారు కూడా మారేలా మార్పు సాధించి చూపించారు. వినూత్న ఆలోచనలు, సంస్కరణలతో ప్రభుత్వ పాఠశాల అంటే ఇలా ఉండాలని చాటుతున్నారు. విద్యార్థులను సొంత బిడ్డల్లా చూసుకుంటూ వారి బంగారు భవితకు బాటలు వేస్తున్నారు. పిల్లలకు ఇంగ్లిష్లో అనర్గళంగా మాట్లాడేలా తర్ఫీదునిచ్చి ప్రపంచ స్థాయిలో పేరుతెచ్చుకున్నారు. తెలంగాణలో 'టెడ్– ఎడ్ టాక్స్ లైసెన్స్' పొందిన తొలి ప్రభుత్వ పాఠశాలగా కీర్తి గడించి ఎస్సీఈఆర్టీ విడుదల చేసిన 'మార్గదర్శకులు'పుస్తకంలో చోటు సంపాదించుకున్నారు. జిల్లా స్థాయిలో ఈ పుస్తకంలో రెండు పాఠశాలలు చోటు సంపాదించుకున్నాయి. అందులో మొదటిది జంగపల్లి ఉన్నతపాఠశాల కాగా, రెండోది చల్లూరు పాఠశాల. ప్రధానోపాధ్యాయురాలు కొత్తపల్లి శారద నేతృత్వంలో విద్యార్థులను ఇంగ్లిష్లో మెరికల్లా తీర్చిదిద్దడం, వినూత్న ఆలోచనలు, సంస్కరణలు చేపట్టడంలో విశేషంగా కృషి చేసిన ముగ్గురు ఉపాధ్యాయులు ఇటీవలే కరీంనగర్ కలెక్టరేట్లో కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. వీరిలో బీ వసుంధర (ఎస్ఏ ఇంగ్లిష్) జిల్లా స్థాయి, శ్రీనివాస్ (ఎస్ఏ ఇంగ్లిష్) మండల స్థాయి, వీ అనిత ( ఎస్ఏ ఫిజికల్ సైన్స్) మండల స్థాయిలో బెస్ట్ అవార్డులను అందుకున్నారు. శ్రమిస్తే విజయం తథ్యమని చాటారు. ప్రధానోపాధ్యాయినిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి శారద పాఠశాలను చక్కదిద్దే పనిలో పడ్డారు. భిన్నమైన ఆలోచనా విధానంతో ఉపాధ్యాయుల సహకారంతో స్కూల్ను టాప్ ప్లేస్లో నిలబెట్టారు. వినూత్న ఆలోచనలతో విద్యా వ్యవస్థను తీర్చిదిద్దే ప్రతిపనిపై పిల్లలకు ప్రాక్టికల్ నాలెడ్జ్ అందిస్తున్నారు.

**మారుమూల ప్రాంతం నుంచి**

జంగపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కరీంనగర్ జిల్లాలోని ఒక మారుమూల గ్రామంలో ఉన్నది. కరీంనగర్ జిల్లా కేంద్రానికి 30 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. 9 సమీప గ్రామాలకు చెందిన 260 మంది విద్యార్థులు ఇక్కడ హైస్కూల్ విద్యను అభ్యసిస్తున్నారు. ఈ ఉన్నత పాఠశాల ఆవిష్కరణలకు ఉన్నత నిలయంగా నిలిచింది. వినూత్న విద్యా కార్యక్రమాలు, విద్యార్థులతో నడిపించే కార్యక్రమాలు టెడ్ ఎడ్ టాక్స్ లైసెన్స్, జన్యు సస్టయినబుల్ ల్యాబ్ యాక్టివిటీ, స్కూల్ ఇన్నోవేషన్, మారథాన్, స్నేహిత కార్యక్రమం వంటి సమాజ కేంద్రీకృత కార్యకలాపాలకు ప్రసిద్ధి చెందింది. విద్యార్థులు సంకోచం లేకుండా ఆత్మవిశ్వాసంతో తమను తాము వ్యక్తీకరించుకోవడానికి ఒక వేదికను సృష్టించింది. ఇందులో చేసిన కృషికి గాను ఎస్సీఈఆర్టీ విడుదల చేసిన 'ట్రయల్ బ్లేజర్స్' పుస్తకంలో చోటు దక్కించుకొని కరీంనగర్ జిల్లాకే తలమానికంగా నిలిచింది.

**టెడ్-ఎడ్ అంటే..**

టెడ్ అంటే టెక్నాలజీ, ఎంటర్టైన్మెంట్, డిజైన్. ఇది అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన పబ్లిక్ స్పీకింగ్ ప్లాట్ఫాం. ఈ విధానాన్ని జంగపల్లి పాఠశాలలో మొదటి సారి ప్రవేశపెట్టారు. టెడ్–ఎడ్ అనేది ఒక అంతర్జాతీయ వేదిక. ఇక్కడ విద్యార్థులు, విద్యావేత్తలు తమ ఆలోచనలను టెడ్–ఎడ్ టాక్స్లో ప్రెజెంట్ చేస్తారు. ఈ టాక్స్ అధికారిక టెడ్–ఎడ్, యూట్యూబ్ చానళ్లలో ప్రదర్శితమవుతాయి. 190కి పైగా దేశాల్లోని ప్రేక్షకులను చేరుకుంటాయి. టెడ్–ఎడ్ కమ్యూనిటీలో పాల్గొనేందుకు, ఒక ఉపన్యాసాన్ని ప్రెజెంట్ చేసేందుకు లైసెన్స్ తప్పనిసరి. ఇందులో భాగంగా కరీంనగర్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో టెడ్ టాక్ పోటీ నిర్వహించగా, టాక్స్ ప్రెజెంట్ కోసం టాప్ 20 మంది విద్యార్థులను ఎంపిక చేయగా జంగపల్లి పాఠశాల నుంచి విద్యార్థిని బీ హాసిని ఎంపికైంది. గ్రామీణ విద్యార్థులు తమ ఆలోచనలను వ్యక్తీకరించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతున్నది. ప్రతి విద్యార్థికి తన నేపథ్యంతో సంబంధం లేకుండా ప్రపంచంతో తమ గళాన్ని పంచుకునే అవకాశం కలిగింది. విద్యార్థుల అభివృద్ధి, వినూత్న అభ్యాస వ్యూహాలపై ఉపాధ్యాయులు నిబద్ధతతో టెడ్–ఎడ్ లైసెన్స్ను విజయవంతంగా సాధించిన తెలంగాణలోని మొదటి పాఠశాలగా నిలిచింది. విద్యార్థుల సృజనాత్మకతను వెలికి తీసేందుకు పాఠశాల ఉపాధ్యాయులు, హెచ్ఎం చేసిన కృషికి ట్రయల్ బ్లేజర్స్ పుస్తకంలో చోటు దక్కడంపై కలెక్టర్ పమేలా సత్పతి అభినందించారు.

***ఆహ్లాదాన్ని పంచేలా పాఠశాల ఆవరణ**

జంగపల్లి ప్రభుత్వ పాఠశాల ఆవరణలోకి వెళ్లగానే విద్యార్థులకు ఆహ్లాదాన్ని పంచేలా విరివిగా పెరిగిన చెట్లు మనల్ని రారామ్మని ఆహ్వానిస్తాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలి కృషితో ఆ పాఠశాల ఇప్పుడు నందనవనంలా మారింది. మొక్కలు పెంచాలన్న సర్కారు లక్ష్యానికి అనుగుణంగా ఈ ప్రభుత్వ బడి ముందుకు పోతున్నది. పర్యావరణానికి పచ్చల హారం తొడిగేందుకు ఆ స్కూల్ హెచ్ఎం ఉడతా సాయంగా తాను మొక్కలు నాటుతూనే విద్యార్థులను, తోటి ఉపాధ్యాయులను భాగస్వామ్యం చేసి వారితో మొక్కలు నాటించి సంరక్షిస్తున్నారు. ఒక్కో మొక్కకు ఒక్కో టీచర్ను ఇన్చార్జిగా నియమించి మరీ కాపాడుకుంటున్నారు. మొక్కల పెంపకం, సంరక్షణలో గన్నేరువరం మండలం జంగపల్లి ప్రభుత్వ పాఠశాల ఆదర్శంగా నిలుస్తున్నది. స్కూల్ హెచ్ఎం శారద ప్రత్యేక చొరవ తీసుకొని బడి ఆవరణలో తీరొక్క మొక్కలు నాటించి సంరక్షిస్తున్నారు. విద్యార్థులు ఎంతో ఇష్టంగా మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఇప్పటికే పాదుకున్న మొక్కలను పాఠశాల నందన వనాన్ని తలపిస్తున్నది. పూలు, పండ్లు, ఇతర వైవిధ్యమైన మొక్కలతో చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటున్నది. సూక్తులు చెప్పడం కంటే పాటించడం వల్లే సమాజం బాగు పడుతుందనేందుకు ఈ పాఠశాల ఉదాహరణగా నిలుస్తున్నది. ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల చిత్తశుద్ధి ఇతర పాఠశాలల వారికి స్ఫూర్తినిచ్చేలా ఉన్నది. మొక్కల పెంపకంపై వారు చూపుతున్న ప్రేమను గ్రామస్తులు సైతం కొనియాడుతున్నారు. పిల్లలతో మమేకమై పెద్దలు సైతం మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటున్నారు. తమ ఊరి పాఠశాల ఉద్యానవనంగా మారేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు శారదకు వేనోళ్లా కృతజ్ఞతలు చెప్తున్నారు.

***సేంద్రియ ఎరువులతో వ్యవసాయం**

పాఠశాలలో కిచెన్ గార్డెన్ ప్రత్యేకంగా నిలుస్తున్నది. స్కూల్లోనే సేంద్రియ పద్ధతుల్లో పండించిన కూరగాయలతోనే మధ్యాహ్న భోజనం కోసం ఆహారాన్ని తయారు చేస్తున్నారు. ఈ పాఠశాలలో డ్రగ్స్కు వ్యతిరేకంగా ఎన్నో చైతన్య ప్రోగ్రామ్స్ నిర్వహించారు. ఎస్సీఈఆర్టీ వారు ఇటీవల పాఠశాలను సందర్శించి విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు.

**ప్రశంసల వెల్లువ**

జిల్లా స్థాయి లో నిరహించిన మాథ్స్, సైన్స్ క్విజ్ పోటీలో జంగపల్లి విద్యార్థులు ద్వితీయ స్థానం సంపాదించడం పట్ల hm విద్యార్థులను మాథ్స్ సైన్స్ టీచర్స్ ను అభినందించారు. జంగపల్లి పాఠశాల ఏ ఒక్క గ్రామానికి దగ్గరగా ఉండదు. అయినా దాదాపుగా 12 గ్రామాల నుండి విద్యార్థులు విద్యానభ్యసించడానికి ఇక్కడకు వస్తారు. గత సంవత్సరం 61 మంది విద్యార్థులు ఎస్సెస్సీలో ఉత్తీర్ణత సాధించి వెళ్ళిపోగా బడిబాట లో భాగంగా 12 గ్రామాలలో తిరిగి 59 విద్యార్థులను పాఠశాలలో చేర్చుకున్నారు. వీరిలో ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు మంచి సంఖ్యలో ఉన్నారు.

హెచ్ఎం శారద, ఇంగ్లిష్ ఉపాధ్యాయులు వసుంధర, శ్రీనివాస్, రాజమౌళి,మాథ్స్, సోషల్ సైన్స్ టీచర్స్ ట్రయల్ బ్లేజర్స్ లో పాఠశాలకు చోటు దక్కడం పట్ల సంతోషం వ్యక్తం చేసారు

**ఇంగ్లిష్ లో మెరికల్లా తీర్చి దిద్దుతున్నాం**

మా పాఠశాల విద్యార్థులను ఇంగ్లిష్ లో మెరికల్లా తీర్చి దిద్దుతున్నాం.. వాళ్ళ భావాలను ఇంగ్లిష్ లోనూ భయం లేకుండా ప్రెసెంట్ చేసేలా తరఫీదు ఇస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ సరిగా నేర్పరు అన్న అపవాదును మా ఉపాధ్యాయుల సహకారం తో పోగొడుతున్నాం. పాఠశాలలో మంచి బోధన అనుభవం ఉన్న ఉపాధ్యాయులు ఉన్నారు. అందరి కృషి వల్లే మా బడికి అవార్డులు వచ్చాయి. ఇంగ్లిష్ నేర్చుకోవాల్లన్న పిల్లల తపన కూడా మాకు గుర్తింపు రావడంలో దోహద పడింది. రాష్ట్రం లోనే టెడ్ ఎడ్ లైసెన్సు పొందిన తొలి పాఠశాలగా కీర్తి దక్కడం మాకెంతో గర్వకారణంగా ఉన్నది.

-శారద, ప్రధానోపాధ్యాయురాలు, జంగపల్లి ఉన్నత పాఠశాల

**టెడ్ ఎడ్ లైసెన్స్ పొందడం సాధారణ విషయం కాదు**

ఒక ప్రభుత్వ పాఠశాల టెడ్ ఎడ్ లైసెన్సు పొందడం అంటే మామూలు విషయం కాదు. దానికి ప్రత్యేక వెబ్ సైట్ ఉంటుంది. అందులో విద్యార్థులు తమ భావాలను పంచుకోవచ్చు. అ వెబ్ సైట్ లో ప్రపంచ వ్యాప్తంగా విద్యార్థులు పాలుపంచుకుంటారు. అలాంటి అవకాశం మా పాఠశాల విద్యార్థులకు దక్కింది. ఇది మీకెంతో సంతోషంగా ఉంది. మా ప్రధానోపాధ్యాయుల ప్రోత్సాహంతో విద్యార్థుల బంగారు భవిషత్ కు బాటలు వేసేలా ఉపాధ్యాయులం సంయుక్తంగా.. సమన్వయంతో కృషి చేస్తున్నాం. మా కృషి, విద్యార్థుల పట్టుదల కారణంగా ట్రయల్ బ్లేజర్స్ బుక్ లో మా పాఠశాలకు చోటు దక్కడం ఎంతో ఆత్మ సంతృప్తిని ఇచ్చింది.

-వసుంధర, శ్రీనివాస్, ఇంగ్లిష్ టీచర్లు, జంగపల్లి ఉన్నత పాఠశాల









# చెన్నూర్ నియోజక వర్గంలో మంత్రికి వ్యతిరేక పవనాలు

## యూరియా కోసం రైతులకు తప్పని ఇబ్బందులు



**శెనార్తి మీడియా, మంచిర్యాల( చెన్నూర్):**

యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతుంటే పోలీసులతో దాడి చేయించిన ఘటనతో రైతుల్లో మంత్రి గడ్డం వినోద్ వెంకట స్వామిపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఎంఎల్ఏకు మంత్రి పదవి రావడం, మెదక్ జిల్లాకు ఇంఛార్జీ మంత్రిగా కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన నాటి నుంచి నియోజక వర్గ ప్రజలను సరిగ్గా పట్టించుకోవడం లేదని రైతులు చర్చించుకుంటున్నారు. మెదక్ జిల్లాపై చూపించిన శ్రద్ధ మంత్రి పదవి రావడానికి కారణమైన నియోజన వర్గంపై చూపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఎరువులను నియోజక వర్గానికి ఎక్కువగా మంత్రి తెప్పించారని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ నాయకులకు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు కనిపించడం లేదా అని ప్రశ్నిస్తున్నారు. లెక్కల్లో ఎరువులు తెప్పించినట్లు చూపిస్తున్న అధికారులు, అవి ఎవరికి చేరినాయో పరిశీలిస్తే దొంగలెవరో భయటకు వస్తుందని, ఇతర జిల్లాలకు, పక్క రాష్ట్రాలకు ఎన్ని ఎరువుల బస్తాలు వెళ్లాయో బయటపడుతుందని రైతులు వాపోతున్నారు. ఎరువులు నియోజక వర్గానికి పంపించింది దళారుల కోసమేనా..? అనే ప్రశ్నలు రైతుల నుంచి ఉత్పన్నమవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ నాయకులు సైతం మంత్రి తీరును వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం. యూరియా తెప్పించాలని నినదిస్తున్నరైతులపై, మద్దతు తెలుపుతున్న నాయకులపై పోలీసుల దాడి సంఘటన నియోజక వర్గం మొత్తం దావానంలా వ్యాపించడం, రైతుల కోసం, ప్రజల సమస్యలపై పోరాడుతున్న పార్టీలకు ఈ అంశాలు లాభం చేకూరేలా కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా మంత్రి నియోజక వర్గంపై, రైతాంగ సమస్యలపై దృష్టి పెడతారో..! లేదో వేచి చూడాల్సిందే.

## రైతులను నిండా ముంచుతున్న

# కాంగ్రెస్ ప్రభుత్వం




- **బీజేపీ రాష్ట్ర నాయకుడు రఘునాథ్ వెరబెల్లి**

**శెనార్తి మీడియా , మంచిర్యాల :**

రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నిండా ముంచుతుందని, ఈ ప్రభుత్వానికి ప్రజలు సరైన బుద్ధి చెప్పే రోజులు ముందున్నాయని బీజేపీ రాష్ట్ర నాయకులు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. గురువారం బీజేపీ నాయకులతో కలిసి తహసీల్దార్ దిలీప్ కుమార్ కు వినతి పత్రం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు రైతులకు యూరియా కొరత ఉంటే ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ముఖ్యంగా చెన్నూర్ నియోజక వర్గంలోని పలు మండలాలకు లేని యూరియా కొరత మంచిర్యాల నియోజక వర్గంలోని మండలాలకు ఎందుకు వచ్చిందో రైతులు అర్థం చేసుకోవాలన్నారు. మంత్రి వివేక్ వెంకట స్వామి అక్కడి రైతులకు ఎక్కువ యూరియా బస్తాలు తెప్పిస్తుంటే, ఇక్కడి ఎమ్మెల్యే మిన్నకుండిపోయారన్నారు. ముందే స్పందించి ఉంటే రైతులకు ఈ పరిస్థితి వచ్చేది కాదని విమర్శించారు. అంతేకాకుండా కల్యాణ లక్ష్మీ, తులం బంగారం, ప్రతి నెల మహిళలకు ఆర్థిక సహకారం, వితంతువుల, దివ్యాంగుల పెన్షన్, విద్యార్థులకు నిరుద్యోగ భృతి, స్కూటీలు, జాబ్ క్యాలెండరు లాంటి హామీలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. అంతకుముందు పట్టణంలోని పలు వీధుల గుండా బీజేపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ తీసి హామీలు అమలు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. బీజేపీ నాయ కులు హరి గోపాల్, హేమంత్ రెడ్డి, స్వామి రెడ్డి, రమేష్ జైన్, ప్రభాకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సింగరేణి రిటైర్డ్ కాలనీలో ఏర్పాటు చేసిన శ్రీశ్రీశ్రీ లక్ష్మి గణేష్ మండలి నవరాత్రోత్సవాలలో భాగంగా గురు వారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలి సభ్యులు మేడం తిరుపతి, ఎంబడి సమ్మయ్య, హరిదాసు, వేణు, రామంచ సంపత్, గాండ్ల సుధీర్, వేముల శ్రీనివాస్, ఆంజనేయులు, లింగయ్య, లచ్చయ్య, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

**బహుమతులు అందుకున్న చిన్నారులు వీరే...**

శ్రీశ్రీశ్రీ లక్ష్మి గణేష్ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో సోలో డాన్స్ జూనియర్స్ లో కే నిత్యశ్రీ, హర్షవర్ధిణి, సీనియర్స్ లో సాయిని జ్యోత్స్న, రేగళ్ల సాన్వి, గ్రూపు డాన్స్ లో ఈశ్వాని – శివాని, రేగళ్ల సాన్వి – రేగళ్ల అన్వితశ్రీ, సింగింగ్ లో శ్రీ వర్షిత్, విశ్వానిలు ప్రతిభ కనబర్చి బహుమతులు అందుకున్నారు. చిన్నారులను కమిటీ సభ్యులతో పాటు కాలనీ వాసులు అభినందించారు.